అలరించనున్న చిలకలగూడ
కూడలి అందాలు

● పాదచారులకు ప్రత్యేక దారులు ● రూ.106 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం ● త్వరలో జంక్షన్ బ్యూటిఫికేషన్ పనులు



త్వరలో ఆధునీకరించనున్న ఒలిఫెంటా సమీపంలోని చిలకలగూడ జంక్షన్

సికింద్రాబాద్: ట్రాఫిక్ సమస్యలు, అస్తవ్యస్త పరిస్థితులతో వాహనదారులను గందరగోళానికి గురిచేస్తున్న చిలకలగూడ కూడలి దశ మారనుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఒలిఫెంటా వంతెనను ఆనుకొని ఉన్న చిలకలగూడ జంక్షన్‌ను ఆధునీకరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

◆ రూ.1.06 కోట్లతో చేపట్టనున్న బ్యూటిఫికేషన్ పనులను రెండు మూడు రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇకమీదట ట్రాఫిక్ ఫ్రీజోన్ జంక్షన్‌గా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తున్నారు. వాహనాలతో పాటు, పాదచారుల రాకపోకలకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు.

మెట్రో కారిడార్ల ఏర్పాటుతో..

◆ కొన్నేళ్ల ముందు వరకు చిలకలగూడ జంక్షన్ ఇరుకైన రహదారులకు కేంద్రంగా ఉండేది. మెట్రో కారిడార్ల నిర్మాణంతో ఒక్కసారిగా ఈ జంక్షన్ రూపురేఖలు మారిపోయాయి. అవసరమైనంత మేర విస్తరణతో సికింద్రాబాద్ ప్రాంతంలో విశాలమైన జంక్షన్‌గా రూపాంతరం చెందింది. గాంధీ ఆస్పత్రి మీదుగా ముషీరాబాద్, తార్నాక మీదుగా ఉప్పల్, సీతాఫల్‌మండి మీదుగా జామై ఉస్మానియా, ఒలిఫెంటా మీదుగా సికింద్రాబాద్ మార్గాలను అనుసంధానం చేసే కూడలిగా చిలకలగూడ కూడలి ఉంది.

◆ విశాలమైనంత మేర కూడలిని విస్తరించినప్పటికీ వాహనదారులకు, పాదచారులకు అవసరమైన పరిస్థితులు జంక్షన్‌లో లేవనే చెప్పాలి. జంక్షన్ చుట్టూరా 13 ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి వినియోగంలోకి రాలేదు. కూడలిలో వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుండగా, పాదచారులు రోడ్డు దాటడం కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులున్నాయి.

హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు రద్దు..

◆ చిలకలగూడ జంక్షన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేశారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేసి.. ఈ రెండింటినీ కలుపుతూ



జీహెచ్‌ఎంసీ అధికారులు రూపొందించిన ప్రతిపాదన

స్కై వాక్‌రింగ్ వంతెన తదితర ఎన్నో వసతులతో జంక్షన్ ఆధునీకరణకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఉప్పల్ రింగ్ రోడ్డులో ఏర్పాటు చేసిన తరహాలో వసతులతో చిలకలగూడ జంక్షన్‌ను తీర్చిదిద్దాలని అంచనా వ్యయాలను సైతం సిద్ధం చేసుకున్నారు.

◆ కొద్ది నెలల తర్వాత సాంకేతిక కారణాలను తెరమీదకు తెచ్చిన హెచ్‌ఎండీఏ అధికారులు ఆధునీకరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నారు. హెచ్‌ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు ఉపసంహరించుకోవడం, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో కొద్ది సంవత్సరాలుగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు.

తాజా ప్రతిపాదనలు ఇవీ!

◆ ప్రయాణికులకు కనువిందు చేసే తరహాలో వాటర్ ఫౌంటెయిన్‌ను చిలకలగూడ జంక్షన్ మధ్యలో ఏర్పాటు చేయనున్నారు. రాత్రి సమయాల్లో జలపాతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఫౌంటెయిన్ మధ్యలో రైల్వేస్టేషన్ లేదా రైలు బొమ్మ (రైల్వేస్టేషన్‌ను స్ఫురించేలా) ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

◆ చిలకలగూడ చౌరస్తా నుంచి తార్నాక, ముషీరాబాద్, సీతాఫల్‌మండి మార్గాల్లో సిటీ బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. ఈ మూడు మార్గాలకు వేళ్లే బస్సులు నిలిపేందుకు ఆయా మార్గాల్లో ప్రత్యేకమైన బస్ బేలు ఏర్పాటు చేస్తారు.

◆ పాదచారులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జంక్షన్‌ను ఆవరించి ఉన్న అన్ని మార్గాల్లో పాదచారులకు మార్గాలు ఏర్పాటు చేశారు. వీటికి ప్రత్యేకంగా బారికేడ్లు, ఇనుపజాలీలు బిగిస్తున్నారు.

◆ జీబ్రా లైన్లు, స్టాప్‌లైన్లు, విద్యుత్ దీపాలతో కూడిన భారీ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. జంక్షన్ ఆసాంతం పచ్చదనం కనిపించేలా మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో జంక్షన్ రూపురేఖలు మొత్తంగా మార్చేందుకు కసరత్తు చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు.

నిబంధనల ప్రకారం సీట్లను భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సీబీఐటీలో ఇంజినీరింగ్ కోర్సుల సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. యాజమాన్య బీ– కేటగిరి సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లను మెరిట్ ప్రకారం భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

లా ఫ్యాకల్టీ డీన్‌గా ప్రొ.వెంకటేశ్వర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లా ఫ్యాకల్టీ డీన్‌గా అధ్యాపకుడు ప్రొ.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇంతకాలం డీన్‌గా కొనసాగిన ప్రొ.విజయలక్ష్మి పదవీ కాలం ముగిడంతో ప్రొ.వెంకటేశ్వర్లు నియమిస్తూ వీసీ ప్రొ.కుమార్ నియామకపు పత్రాన్ని అందజేశారు. గతంలో ప్రిన్సిపాల్‌గా,అడిషనల్ కంట్రోలర్‌గా తదితర పదవులను చేపట్టిన ఆయన ఓయూలో సుపరిచితుడు.

ఎన్‌సీసీ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

లాలాపేట: ఫిట్నెస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీజీ ఎన్‌సీసీ సహకారంతో ఖేలో ఇండియా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఫిట్ ఇండియా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా దీన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ ఫిట్ ఇండియా ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలనీ పిలుపునిచ్చారు. సంపూర్ణ వ్యాయామానికి సైకిల్ తొక్కడం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్, ఏఎన్‌ఓ, పీటీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా బ్రహ్మజీ



టెంపుల్ బోర్డు మెంబర్‌గా నియామక పత్రం అందుకుంటున్న బ్రహ్మజీ


లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎన్. బ్రహ్మజీ చిలకలగూడ హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. గురువారం టెంపుల్‌లో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మజీ బోర్డు మెంబర్ నియామక పత్రాన్ని ఎండోమెంట్ అధికారుల ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మజీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎండోమెంట్ విభాగం ద్వారా హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా తన నియామకానికి సహకరించిన సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్‌కు, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీజీయూఎస్ సికింద్రాబాద్ కన్వీనర్‌గా మాణిక్యప్రభు



చిలకలగూడ: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) సికింద్రాబాద్ కన్వీనర్‌గా చిలకలగూడకు చెందిన మాణిక్యప్రభు నియమితులయ్యారు.ఈమేరకు సమితి జనరల్ సెక్రటరీ రావినూతల శశిధర్ గురువారం నియామక ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా మాణిక్యప్రభు మాట్లాడుతూ.. అన్నివేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ గణేశ్ ఉత్సవ నిర్వాహకులు, పోలీసులు, అధికారులతో సమన్వయంతో గణేశ్ నవరాత్రి వేడుకలు, శోభయాత్రలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వెనుకబడిన కులాలను గుర్తించాలి



అడ్డగుట్ట: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి నాయకులు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావును గురువారం కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన కులాలు సోమవంశ క్షత్రియ, బైలు కమ్మరి, గంజికూటి, బొందిలి, శిష్టకరణం తదితర 28 కులాలు ఇప్పటికీ విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారిని ఓబీసీ జాబితాలో గుర్తించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. స్థానిక సంస్థల్లో ఏ,బీ,సీ,డీ,ఈ లుగా రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసి, రాజకీయ గుర్తింపులేని కులాలకు అవకాశం కల్పించాలన్నారు. అందుకు అసెంబ్లీలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు కుమార్ మహేంద్ర, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, గోగుల స్వామి, మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి బాయమ్మ, శ్రీకాంతాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 31 కుటుంబాలకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుండేదన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రస్తుతం చెక్కుల పంపిణీ శరవేగంగా సాగుతోందన్నారు. లబ్ధిదారులకు సకాలంలో చెక్కులు అందుతూ ఉండటం వల్ల సద్వినియోగం అవుతున్నాయన్నారు.

ప్లాట్ మార్కెట్ వివాదంపై స్పందించిన జ్యువెలరీ అసోసియేషన్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండాలోని ప్లాట్ మార్కెట్‌లో జరిగిన సంఘటనపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇటు వ్యాపారులు, అటు బాధితుడు గురువారం మీడియా ముందుకు వచ్చారు. ఈ సంఘటన తెలంగాణ–మార్వాడీ వ్యాపారుల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఈ చర్చకు ముగింపు పలకాలని కొందరు మధ్యవర్తులు నిర్ణయించి గురువారం మీడియా సమావేశం అంటూ హడావుడి చేశారు. మధ్యవర్తులు అటు ప్లాట్ మార్కెట్ అసోసియేషన్‌తో పాటు దాడికి పాల్పడిన వ్యక్తితో చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా దీనిపై ప్లాట్ మార్కెట్ జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌జైన్ మాట్లాడుతూ చిన్న వివాదాన్ని రాద్ధాంతం చేయొద్దని కోరారు. రోడ్డుపై జరిగిన సంఘటనను మార్వాడీలందరికి ఆపాదించడం సరికాదన్నారు. ఓ షాపు నిర్వాహకుడు చేసిన ఘటనకు మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సికింద్రాబాద్‌లో తాము, తమ పూర్వీకులు 100 సంవత్సరాల నుంచి జీవనం సాగిస్తున్నామని, అందరితో తాము ప్రేమభావంతో ఉంటామన్నారు. మరోవైపు ఓ జ్యువెలరీ షాపు నిర్వాహకుడు తాను టకారబస్తీ వాసిని అని చెప్పినా విన్పించుకోకుండా తనపై దాడి చేశారని బాధితుడు సాయి మీడియా ముందు వాపోయారు. స్థానికంగా మార్వాడీలతో తమకు ఎలాంటి గొడవ లేదన్నారు. సదరు వ్యక్తిపై తాను న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

● సెప్టెంబర్ 12న టియూజేఏసీ మహా ధర్నా ● వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీయూ జేఏసీ నాయకులు

అడ్డగుట్ట: రాష్ట్రంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని భావిస్తే చివరికి అన్యాయమే జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రొఫెసర్ బాగయ్య పేర్కొన్నారు. తుకారంగేట్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సెప్టెంబర్ 12న ఇందిరా పార్కు వద్ద జరిగే టీయూజేఏసీ మహా ధర్నా పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరికి వెళ్లినా ఇంతవరకు ఉద్యమకారులను ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులు చేసిన పోరాటాలను గుర్తుపెట్టుకోలేదన్నారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 12న ఇందిరా పార్క్ వద్ద టీయూజేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. మహాధర్నా తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా యాదగిరి, మోత్కూరి మల్లేశం, ఏలూరు బాబన్న, డోలక్ యాదగిరి, చంద్రకళ, పావని, కమల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

గణేశ్ మండప నిర్వాహకుల సమావేశంలో గాంధీనగర్ ఏసీపీ యాదగిరి



బన్సీలాల్‌పేట్: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతం చేయడానికి సహకరించాలని గాంధీనగర్ డివిజన్ ఏసీపీ యాదగిరి కోరారు. బోయిగూడ ముదిరాజ్ సంఘంలో గురువారం నిర్వహించిన గణేశ్ మండప నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండపాలు ఆధ్యాత్మిక శోభను వెల్లువిరిసేలా ఉండాలన్నారు. ప్రతీ మండపంలో రాత్రి వేళల్లో నిర్వాహకులు ఉండాలని, ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గణేశ్ నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ సిస్టంను అనుమతించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. గణేశ్ మండపాల్లో నిష్టగా పూజలు చేసుకుంటూ సదరు ప్రాంతంలో ఆధ్యాత్మికభావన వెల్లువిరిసేలా చూడాలన్నారు. మత విద్వేషాలతో సమాజంలో అలజడి సృష్టించాలని ప్రయత్నించే వ్యక్తులు, శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నిమజ్జన ఊరేగింపులను త్వరగా ప్రారంభించాలని కోరారు. మండపాల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ ఏఈలు కృష్ణ, సుబ్రహ్మణ్యం, ఎస్.ఐలు నర్సింహ, హరీశ్‌లతో పాటు పెద్ద ఎత్తున గణేశ్ మండప నిర్వాహకులు హాజరయ్యారు.

రేపు ఎస్సార్‌నగర్‌లో రక్తదాన శిబిరం

సనత్‌నగర్: విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రాహ్మకుమారీస్ సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న ఎస్సార్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్ పక్కన గల రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని, శరీరంలో కొత్తరకం కణాలు ఉత్పత్తి అవుతాయన్నారు. రోగ నిరోధకశక్తిని పెంచుతుందన్నారు. శరీరంలో అధిక ఇనుము స్థాయిని నియంత్రిస్తుందని చెప్పారు. క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుందని, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. రక్తదానానికి యువత స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ మాయం

సనత్‌నగర్: ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్ మాయమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌లో నివాసం ఉండే తోకల మనోజ్‌కుమార్ (25) తన స్ప్లెండర్ బైక్ (ఏపీ 15ఏఎక్స్ 6352)ను రోజు లాగానే ఈ నెల 17న రాత్రి 11.30 గంటలకు ఇంటి ఎదుట పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చూడగా బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో సనతనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలి

ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు నైపుణ్యాలను మెరుగుపరుకుంటూ వెళ్తే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ అనేవి చాలా ముఖ్యమని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కోర్సులకు ఉండే ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాలు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ పీఎల్ శ్రీనివాస్, చైర్మన్ డాక్టర్ ప్రేమ్ నారాయణ్ కళాశాలలోని కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల కెరీర్, లక్ష్యాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్ ప్రతినిధులు నరేష్‌యాదవ్, భగవత్ వారణాసి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలు పాటించాలి



సనత్‌నగర్: వినాయక మండప నిర్వాహకులు భద్రతా చర్యలను పాటించాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మిపెరుమాళ్ సూచించారు. నార్త్‌జోన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వినాయక మండప నిర్వాహకులతో గురువారం క్లాసిక్ గార్డెన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ వారికి పలు సూచనలు చేశారు. గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు భద్రతా విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలకు సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అశోక్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా అప్రమత్తంగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలుండవని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని చుట్టలబస్తీ ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన ఇటీవల నాలా వెంట ఉన్న ప్రహరీ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే కూలిన గోడను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నాలాలో ఉన్న సిల్ట్ తొలగింపుకు చర్యలు చేపట్టాలని సూచించారు. బస్తీలో విద్యుత్ స్తంబాలు పక్కకు ఒరిగిపోయి ఉండటం, విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు ప్రమాదభరితంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. అధికారులు ముందు జాగ్రత్తగా ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు, విద్యుత్ వైర్లను గమనిస్తూ ఉండాలన్నారు. లేకపోతే ఇటీవల రామంతపూర్ లాంటి ఘోర దుర్ఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న తలసాని

వ్యాయామశాల వద్ద రోడ్డు సక్రమంగా లేదని, వర్షం నీళ్లు నిలిచిపోయి ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించి వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ డాకూనాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, జలమండలి డీజీఎం ఆశిష్, ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిశోర్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి



బేగంపేట మాతాజీనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: మాతాజీనగర్‌కు వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా నిర్మిస్తున్నందున పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌లో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ముందుగా స్థానికంగా డ్రైనేజీ పొంగిపొర్లుతుండడంపై అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత జనాభాకు పైప్‌లైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పాత పైప్‌లైన్ల స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన పైప్‌లైన్లను నిర్మించాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. అవసరమైతే అధిక సామర్థ్యం కలిగిన పైప్‌లైన్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. అలాగే మాతాజీనగర్ ప్రధాన రోడ్డులో రూ.27 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రోడ్డుకు ఒకవైపు నిర్మాణం జరిపి, మరోవైపు వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని స్థానికుల ఫిర్యాదు దృష్ట్యా ఆమె రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, నరేష్, మాతాజీనగర్ ప్రతినిధులు గంగారాం, కార్తీక్, శైలు, మూర్తి, శ్రీను, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు పదుల వయసులో పీహెచ్‌డీ.!



డా.ముకుందేశ్వరి

లాలాపేట: విద్య, జ్ఞాన సముపార్జనకు వయోపరిమితి లేదని ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగం నుంచి ఆంగ్ల భాషా సాహిత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసింది 63 ఏళ్ల ముకుందేశ్వరి. ఇటీవల ఓయూలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఏకంగా ఇస్రో చైర్మెన్ నారాయణ, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఓయూ వీసీ ప్రొ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. విద్యావంతుల కుటుంబానికి చెందిన ముకుందేశ్వరి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా పీహెచ్‌డీ పూర్తి చేసిన వారే కావడం గమనార్హం. భర్త డాక్టర్ శివకుమారస్వామితో పాటు ఆమె ముగ్గురు కుమార్తెలు సైతం పీహెచ్‌డీలు పూర్తి చేసి డాక్టరేట్ డిగ్రీలు అందుకోవడం విశేషం. కుటుంబమంతా విద్యా నైపుణ్యం, మేధోసంపత్తికి పుట్టినిల్లుగా నిలుస్తుంది. ఇప్పుడు ఆమె పీహెచ్‌డీ పట్టాను అందుకోవడంతో ఇళ్లంతా పీహెచ్‌డీ పట్టాదారులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యాసం అనేది జీవితాంతం కొనసాగే ప్రయాణం అన్నారు. వయస్సును జ్ఞానానికి ఎప్పుడూ అడ్డంకిగా చూడకూడదని తెలిపారు. తాను సాధించిన ఈ విజయం మహిళలకు, సీనియర్ సిటిజన్లకు, జీవితాంతం నేర్చుకునే వారికి ప్రేరణ ఇస్తుందన్నారు.

మార్టిగేజ్ విధానాన్ని రద్దు చేయాలి

కంటోన్మెంట్: నూతనంగా ప్రవేశపెట్టిన మార్టిగేజ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పికెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో నాలుగేళ్లుగా ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండా అప్రజాస్వామిక పాలన సాగుతోందన్నారు. కంటోన్మెంట్‌లో భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియ సంక్లిష్టంగా ఉందన్నారు. దీనికి తోడు తాజాగా ప్రవేశపెట్టిన మార్టిగేజ్ విధానంతో ప్రజలకు మరిన్ని ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీనికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాల్సిన బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు, బోర్డులో ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యే, ఎంపీ ప్రజావ్యతిరేక విధానానికి ఆమోదం తెలపడం దారుణమన్నారు. భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేకపోతున్నామని, మార్టిగేజ్ విధానం అమలు చేయడం అన్యాయం అన్యాయమన్నారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగానే ఇక్కడ కూడా మార్టిగేజ్ విధానం అమలు చేస్తామంటున్న బోర్డు అధికారులు, పూర్తిస్థాయిలో అక్కడి మాదిరిగానే అమలు చేయాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన టీఎస్–బీపాస్ ద్వారా జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియ సరళతరం అయిందన్నారు. ఎవరి జోక్యం లేకుండానే నేరుగా అనుమతులు జారీ అవుతున్నాయన్నారు. 200 గజాలకు పైబడి చేపట్టే నిర్మాణాలకు మాత్రమే మార్టిగేజ్ విధానం అమలవుతుందని గుర్తు చేశారు. అదే కంటోన్మెంట్‌లో మాత్రం ప్రతీ నిర్మాణానికి మార్టిగేజ్ తప్పనిసరి చేయడం విడ్డూరం అన్నారు. పేదలను ఇబ్బందులకు గురి చేసే విధానాలపై బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.